తన డెబ్బై అయిదవ పుట్టిన రోజుకి పులిరాజు పూలరంగడిలాగ తయారయ్యాడు. ఈరోజు కార్యక్రమం అతనికి అలవాటే. భార్య తాయిలమ్మ పుట్టిన రోజున మాత్రం పులిరాజు తాగడానికి అనుమతిస్తుంది. పులిరాజు తెలంగాణాలో ఉన్న రోజుల్లో చేసుకున్న అతి రుచికరమయిన అలవాటు తాటికల్లు తాగడం. ఇప్పటికీ తెలంగాణా రాజమార్గాల్లో ఘరానా కార్లు తాటిచెట్ల నీడల్లో ఆగుతాయి. కుండల్తో తాటికల్లు ఖరీదైన కడుపుల్లోకి రవాణా అవుతుంది. నల్గొండ మామగారి నాలుగు వందల ఎకరాల సాగుతోపాటు చేసుకున్న అలవాటు పులిరాజుకి. తాయిలమ్మకీ, పులిరాజుకీ కేవలం రెండేళ్లే తేడా. పులిరాజు ఇప్పటికీ మీసాలకీ, జుత్తుకీ రంగు వేస్తాడు. అయితే వయస్సుతోపాటు రంగు వేసే చాకచక్యం సన్నగిల్లి రంగుకి రంగూ, వెంట్రుకల తెలుపూ వేర్వేరుగా కనిపిస్తూంటాయి. తాయిలమ్మ వయస్సులో నల్లశానం రాయితో చెక్కిన అమ్మవారి విగ్రహంలా ఉండేది. ఆవిడలో ఏ కోశానా అందం ఉండేది కాదు. ఆ విషయం తాయిలమ్మకీ తెలుసు, వాళ్ల నాన్నకీ తెలుసు. ఆ రోజుల్లో నల్గొండ మోతుబరి ఏలూరు దాకా వెళ్లి పెదకాపు పులిరాజుని అల్లుడుగా ఎన్నిక చేశాడు. ఆ రోజుల్లో పులిరాజు దూసిన కత్తిలాగా ఉండేవాడు. వృత్తిరీత్యా కళ్ల డాక్టరు. మెడికల్ కాలేజీలో ఉన్నరోజుల్లోనే అతనికి రంగు చీర కనిపిస్తే కళ్లు మసకలు కమ్మేవి. దబ్బపండు లాంటి తెలుపులో ఉన్న పులిరాజు చొరవకి దాదాపు ఏ ఆడపిల్లా ఎదురుచెప్పేది కాదు. కిట్టనివాళ్లు ఆ దురలవాటుకి 'వ్యభిచారం' అని పేరు పెట్టినా, పులిరాజు దానికి 'చేపనంజుడు' అని ముద్దుపేరు పెట్టుకొన్నాడు. మరి ఇంత అందగాడు నల్లశానం రాయి లాంటి తాయిలమ్మని ఎందుకు చేసుకున్నాడు? నాలుగు వందల ఎకరాలు ఎలాంటి రాజీకయినా మనిషిని తలొగ్గేలా చేస్తాయి. కాగా, పులిరాజు నంజుడు ఎలాగూ ఉంది.




మొదటి రాత్రికే పెళ్లానికి తన నంజుడు గురించి

స్థాలీపులాకన్యాయంగా ఉపన్యసించాడు పులిరాజు. ముందుముందు తన మార్గాన్ని సుగమం చేసుకోడానికా? తన నంజుడుని పెళ్లాం అర్థం చేసుకోవడం మంచిదనుకొన్నాడా? ఏమయినా తాయిలమ్మ శరీరంలో లేని అందం ఆమె మెదడులో ఉంది.. పులిరాజు రొమాన్స్ విని మనసారా నిట్టూర్చి నవ్వుకొంది. బొత్తిగా లంఖణం చేసేవాడికి అన్నం పెట్టడం కష్టమేమీ కాదు. నంజుడుకి అలవాటు పడ్డవాడికి పిండివంట తినిపించడం కష్టం కాదు. పులిరాజు మనిషి రక్తం మరిగిన పులి. ఆమెకి కావలసింది అంతే! భర్త తనకి నచ్చాడని మర్నాడే తండ్రితో చెప్పింది. తండ్రి నిట్టూర్చాడు.

తర్వాత-తర్వాత-ఇద్దరి మధ్యా దాదాపు యాభై ఏళ్ల జీవితం గడిచింది. ఏనాడూ వారి జీవితంలో అపశ్రుతి తొంగి చూడలేదు. తొంగిచూడనివ్వలేదు తాయిలమ్మ. పెళ్లయ్యాక మామగారి సహాయంతో పెద్ద కళ్లాసుపత్రి తెరిచాడు హైదరాబాదులో. ఆ రోజుల్లో 'కళ్లకి ప్రత్యేకమైన ఆసుపత్రులు బాగా కొత్త. అయినా పులిరాజు ఆసుపత్రి నిండా ఆడా, మగా కళ్లనిండా కళకళలాడుతూ కనిపించేవారు. అందరు పేషంట్ల మధ్యా పులిరాజు కళ్లల్లో చంద్రుడిలాగ వెలిగిపోయాడు. నంజుడు?-దాదాపు ప్రతీ విషయం తాయిలమ్మ చెవులదాకా వెళ్లేది. అయినా భర్తతో ఏనాడూ తగాదా పెట్టుకోలేదు, ఏనాడూ నిలదీయలేదు.

పులిరాజు ఏనాడూ కోరికతో తాయిలమ్మని దగ్గరకి తీసుకోలేదు. తాయిలమ్మ ఏ ఒక్కనాడూ తీసుకోమని భర్తని దేబిరించలేదు. పెళ్లయిన పదేళ్లదాకా ఇద్దరికీ పిల్లలు పుట్టలేదు. తాటికల్లు రుచికి ఏ పదిసార్లో పులిరాజు భార్యతో ఎంగిలి పడివుంటాడేమో?

ఉన్నట్టుండి-దాదాపు ముప్ఫయ్యేళ్ల కిందట పులిరాజు 'నంజుడు' కార్యక్రమం ఆగిపోయింది. తర్వాత ముప్పై ఏళ్లు వాళ్లిద్దరి కాపురమూ మూడు పువ్వులూ ఆరు కాయలుగా సాగిపోయింది. అలా జరుగుతుందని పులిరాజే ఏనాడూ ఊహించలేదు. అమ్మాయిల్ని వేటాడడం అతని సరదా, వినోదం, ఆటవిడుపు. ఆ పనిని అర్ధంతరంగా-వదిలిపెడతాడని అతనే అనుకోలేదు. అంతకుమించి-తాయిలమ్మతో కాపురం!

ఇదంతా ఎలా జరిగింది? ఈ ప్రశ్నని ప్రతి పుట్టినరోజు నాడూ పులిరాజు అలవాటుగా తాయిలమ్మని అడుగుతాడు. తాయిలమ్మ చిరునవ్వు నవ్వి, "వచ్చే ఏడు చెప్తాబే పుట్టినరోజు పెళ్లికొడకా!" అని ముద్దులాడుతుంది. పులిరాజు గిజగిజలాడిపోతాడు ఆత్రం తీరక. ముప్పై ఏళ్లు ఈ ముడి విప్పడానికే తను పుట్టినరోజు కోసం ఎదురుచూశాడు.

ఇప్పుడు ప్రశ్న రూపం కాస్త మారింది. ఇదంతా తాయిలమ్మ ఎలా సాధించింది?

ఆ సమాధానం కోసమే తాటికల్లు తలకెక్కినా-చచ్చే ఆత్రంతో ఎదురుచూశాడు.

"ఇవాళ చెప్తాబే, ముసలి పెళ్లికొడకా!" అని ముద్దులాడింది తాయిలమ్మ.

**తాయిలమ్మ**

నేను అందంగా ఉండనని నాకు తెలుసు. మా ఆయన అందంగా ఉంటాడని అందరికీ తెలుసు. భర్త రూపవంతుడయితే శత్రువని ఎవరూ చెప్పలేదు. కానీ పులిరాజు ఆడరక్తం మరిగిన పులి. అది నాకు గర్వకారణమే. అయితే ఆ ఆడది నేనొక్కర్తే కావాలని నా కోరిక. అందంగా లేకపోయినా కోరికా, అలంకారం లేకపోయినా సెక్సూ నాలో లోపం లేదని పులిరాజుకి తెలియదు. ఇది తెలియజెప్పాలని నేనెప్పుడూ ప్రయత్నించలేదు. చేతిలో పెట్టిన మిఠాయికి రుచి తక్కువ!

పెళ్లయాక-పులిరాజు నంజుడు గమనించినప్పుడల్లా-ఈ అవకాశం నాదనిపించినా, ఆ అవసరాన్ని తీర్చే అతని సామర్థ్యం నన్ను గర్వపరిచేది. నూతిలో అమృతం లాంటి నీళ్లున్నాయి. కానీ మరెవరో దాహం తీర్చుకొంటున్నారు. దేబిరించడం నాకు ఎవరూ నేర్పలేదు.

ఏనాడూ అసంకల్పితంగా పులిరాజు చెయ్యి నా మీద పడలేదు. పడడానికి నేను ప్రయత్నించలేదు. ఒకవిధంగా పులిరాజు తన మనస్సులో నాకు

# సెక్స్ కథ

## గొల్లపూడి మారుతీరావు


# మయూరి

సచిత్రవారపత్రిక

పున: ప్రారంభం

ఏప్రిల్ "24" తేదీన విడుదల

ఎడిటర్ & పబ్లిషర్ డి. భీమ్‌రెడ్డి

కాకతీయ పబ్లికేషన్స్

నాంపల్లి స్టేషన్‌రోడ్, హైదరాబాద్ -500001.

ఫోన్ : 3201181

సీరియల్స్

- మల్లాది వెంకట కృష్ణమూర్తి
  గ్రీన్ కార్డ్
- రావినూతల సువర్నాకన్నన్
  అనురాగ సంగమం
- సూర్యదేవర రామ్‌మోహన్‌రావు
  నేడే విడుదల
- సింహప్రసాద్
  ఏ దివిలో విరిసిన పారిజాతమో...
- ముచ్చర్ల రజనీ శకుంతల
  హైజాక్ 2000
- కథలు, కార్టూన్లు, జోక్స్, ఆర్టికల్స్, సినిమాకబుర్లు ఇంకా...ఎన్నో... ఎన్నెన్నో...

చదవండి-చదివించండి

మార్కెటెడ్ బై :

మార్గదర్శి మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్

ఈనాడు కాంపౌండ్, సోమాజిగూడ, హైదరాబాద్ - 500082 ఫోన్:3318181


కృతజ్ఞత చెప్పుకునేవాడేమో-ఇష్టంలేని పనికి పురికొల్పనందుకు. క్రమంగా నా తాటస్థ్యం నావట్ల అతని గౌరవంగా, కాస్త భయంగా మారుతూ వచ్చింది.

ఓ పుట్టినరోజు నాడు ఆగలేక అడిగాడు-"నేను నంజుడు మరిగితే నీకు కోపం రాదా, దొరసానీ?" అని.

***

ప్రశ్న అడగ్గానే చాచి చెంపదెబ్బ కొట్టింది. పులిరాజుకి కళ్లు బైర్లు కమ్మాయి.

"నొప్పెట్టిందా లంజకొడకా?" అని ముద్దుగా




అడిగింది తాయిలమ్మ. సమాధానం పులిరాజు కళ్లల్లో నీళ్లు.

"దెబ్బ తగిలితే అందరికీ నొప్పెడుతుంది బే! కొందరు చూపిస్తారు. కొందరు దాచుకుంటారు. నేను నల్గొండ నాయుడు కూతుర్ని. బాధపడటం అలవాటు లేదు!"

కానీ ఒక్కసారి-ఒక్కసారయినా-కిరసనాయిలు పోసుకుని కాల్చుకోవాలనిపించింది తాయిలమ్మకి. అయితే పిరికితం ఆమె రక్తానిది కాదు. ఆ క్షణంలో పులిరాజు నంజుడు పడుతున్న దేవయాని అనే నర్సు పట్ల ఈర్ష్యది. దేవయాని పందెపుగుర్రంలాగా ఉంటుంది. కళ్లు లోతుకు పోయినా కసిగా ఉంటాయి. ఒళ్లు బూరుగుదూదిలా ఉన్నా లేడిలాగా పరుగులు తీస్తుంది. కళ్ల డాక్టరు తన కళ్లు కప్పుతున్నాడనడానికి ఎక్కువ టైం పట్టలేదు తాయిలమ్మకి.

ఏనాడూ పులిరాజుని నిలదీయలేదు. ఒక్కసారయినా దేవయానిని నిష్ఠూరంగా సాధించలేదు. ఆమెకి ఇద్దరు పిల్లలూ, భర్తా ఉన్నారు. భర్త సర్వే ఆఫీసులో గుమాస్తా. మనిషి నక్కలాగ ఉంటాడు. నమ్రతతో, దేవయాని శరీరం నీడలో బతికే మనిషిలాగ కనిపిస్తాడు.

ఒక్కొక్కప్పుడు ఎవరి ఒళ్లయినా రాయాలంటే -పక్కవాడి తుంటిమీద కొట్టాలి. పులిరాజుకి దేవయాని 'నంజుడు' తప్పించాలంటే సర్వే ఆఫీసులో కుచేలరావుని పునాదులతోసహా కదిపింది తాయిలమ్మ. అవినీతికి పెద్ద పెద్ద ఖరీదులు నిర్ణయించే రోజులు కావవి. అవినీతి చెప్పుచేతల్లో ఉన్న రోజులు. తక్కువ ఖర్చుతోనే కుచేలరావుని గుడివాడకి కదిపాడు. దేవయాని రథం కదిలింది. ఈసారి నర్సుని తనే పనికట్టుకుని వెదికింది ఈసారి అవకాశం పోనివ్వదలుచుకోలేదు.

ఎలాంటి నర్సు కావాలి? బుద్ధిమంతురాలయిన అందవికారా? పెంకిగా ఉండే నల్గొండ నాయుడుగారమ్మాయా? రౌడీలాంటి భర్త ఉన్న భర్త చాటు భార్యనా?

తాయిలమ్మ ఎక్కువ చదువుకోలేదు. కానీ స్త్రీ, స్త్రీగా బ్రతకడానికి బడుల్లో చదువులు అవసరం లేదు. తల్లి ప్రేమని ఏ బడి నేర్పుతుంది? ద్రౌపదిలో పగని ఏ స్కూలు దారిలో పెడుతుంది? కాగా, తాయిలమ్మ వీథిన పడే కుసంస్కారి కాదు. తన భర్తని దక్కించుకోవడానికి పది సంవత్సరాలుగా ఓపిక పట్టిన అభిమానవంతురాలు. అల్లరి కావడం అనవసరమని ఎరిగిన వివేకి.

గిల్లితే పాలుకారే బంగారపుఛాయతో, చూస్తే కలల్లోకి లాక్కుపోయే మత్తయిన కళ్లతో, శరీరంలో ఎక్కడా అనవసరంగా ఎదుగుదల అవసరం లేని అందమైన కుందనపుబొమ్మని నర్సింగు కాలేజీలో ఎంచి తెచ్చింది. చూసేవాళ్లకి, "భర్తకి ఈవిడే మప్పుతోందా?" అనే అనుమానం వచ్చేటట్టుంది. పరిమళ-అదీ ఆ అమ్మాయి పేరు. వాళ్ల నాన్నతరంలో మతం పుచ్చుకొన్నారు. జీతం పాతిక రూపాయలు ఎక్కువే నిర్ణయించింది.

పరిమళకి పెళ్లయి రెండేళ్లయింది. అంటే శరీరం సుఖానికి అలవాటు పడింది. పిల్లలు లేరు. అంటే శరీరం అలసిపోలేదు. చాలా చురుకైన పిల్ల. అంటే -ఆచరణకి ముందే ఆలోచన దూకుతుంది. మరి పరిమళని పులిరాజు సమక్షంలో పుంచడం-పులి ముందు మాంసం ముక్క పుంచడం కాదా?

పులిరాజు ఢిల్లీ కాన్ఫరెన్స్‌కి వెళ్లినప్పుడు పరిమళని ఎంపిక చేసి నర్సింగ్‌హోమ్‌లో పెట్టింది.

## తాయిలమ్మ

తెలిసి తెలిసి పులినోట్లో చెయ్యి పెడుతున్నానని అంతా అనుకొన్నారు. ఎప్పుడూ మాట్లాడని మా నాయన కూడా చెప్పలేక చెప్పలేక: "పరిమళ బొత్తిగా చిన్నపిల్లలాగ ఉంది. ఎవరయినా వయస్సు ముదిరినదాన్ని పెట్టకూడదా, పాపా?" అన్నాడు. నాకు నవ్వొచ్చింది.

తీపి మీద మోహాన్ని తీపే పోగొట్టాలి. కోరికకి కోరికే విరుగుడు. తాగుడు మరిగిన తాగుబోతుకు తన అలవాటు మీద విరక్తి కల్లుపాకలోనే ప్రారంభం కావాలి, దేవాలయంలో కాదు! యోగి వేమన మోహం వదినగారు దిశమొలతో నిలబడినప్పుడే పటాపంచలయింది. నా పాచిక పారిందా పులిరాజులో పులి, రుచి మార్చుకుంటుంది. లేదా మరో నంజుడు ప్రారంభమవుతుంది. నిప్పు కొలిమిలో కొత్త సమిధ కాలడం విడ్డూరమూ కాదు, విపరీతమూ కాదు!

పరిమళతో నేనే సాధించదల్చుకొన్నాను?

ఇంకా పులిరాజు ఢిల్లీ నుంచి రావడానికి నాలుగు రోజులున్నాయి. ఈ నాలుగురోజులూ పులిరాజు ఎంత ఏకపత్నీవ్రతుడో పరిమళకి తెలిసేటట్టు చేశాను. పరిమళ నా అందాన్ని చూశాక, పులిరాజు నాకే కట్టుబడి ఉండడాన్ని గొప్పగా మనస్సులోనే భావించింది. మిఠాయి దుకాణంలో వ్యాపారి ఉపవాసం గొప్పది. కానీ ఎడారిలో మంచినీటి సెల వంటివాడు పులిరాజు అని భావించింది పరిమళ. చూడని మా ఆయన మీద ఎక్కడ లేని గౌరవం పెంచుకొంది. నా ప్రణాళికకి ఈ గౌరవం ప్రాతిపదిక. ఇప్పుడిక పులిరాజు ఢిల్లీ నుంచి రావడానికి ఎదురు చూశాను.

## పులిరాజు

తాయిలమ్మ చెంప ఛెళ్లుమనిపించినప్పటినుంచీ నా నంజుడు గురించి జాగ్రత్తగానే వున్నాను. దేవయాని మానెయ్యడం పెద్ద దెబ్బ. ఇంక నా ఆటలు సాగవనే నిర్ధారణకి వచ్చాను. వయస్సు నలభై దాటుతోంది. మరో రెండు మూడు నంజుళ్లతో ఈ జీవితానికి సరిపెట్టెయ్యచ్చు. నాలుగు పెగ్గులు తలకెక్కాక ఆఖరి పెగ్గు

వొంపుకోవడం లాంటిది ఈ బుద్ధి.

'పరిమళ' అనే నర్సుని ఏర్పాటు చేశానని తాయిలమ్మ ఫోన్‌లో చెప్పగానే నేను నీరసంతో జారిపోయాను. ఈసారి తాయిలమ్మ నాకే అవకాశం ఇవ్వదలుచుకోలేదు. పరిమళ-పేరులో చాలా కొత్తదనం ఉన్నా, మనిషి చింతమొద్దులాగా ఉంటుందనీ, వయస్సు నలభై అయిదు ఉంటుందనీ, ఆమెకి కనీసం అయిదుగురు సంతానం ఉంటారనీ-మాటిమాటికీ పగలబడి నవ్వుతూ, శరీరం తెలిసేలాగా మీదబడి మాట్లాడుతూంటుందనీ-ఇలాగ ఊహించుకున్నాను. ఏమైనా మరో చెంపదెబ్బకి సిద్ధంగా లేను. నంజుడు అవకాశాలు రాకుండా పోవు. ఈసారి కాన్ఫరెన్స్‌ల సంఖ్య పెంచుకొంటే సరిపోతుంది.

కానీ పరిమళని చూడగానే షాక్ అయ్యాను. ఆమె అందాన్ని చూసి దాదాపు మూర్ఛపోయాను. "ఈవిడేనా పరిమళ?" అని సిగ్గు విడిచి మూడుసార్లు అడిగాను మా ఆవిడని. " ఈవిడేనండీ-మరీ దగ్గరకి వెళ్లి మాట్లాడకండి. బ్రూట్ వాసన తగిలితే పిచ్చెక్కిపోతుందట!" అంది తాయిలమ్మ.

నాకు మతిపోతోంది. లేక మా ఆవిడకి ఇదివరకే పోయిందా? నా కళ్లముందు పరిమళలాంటి అందకత్తెని-

"ఎక్కడ సంపాదించావు ఈవిడని..." అన్నాను నీరసంగా.

"ఎక్కడేమిటండీ? ఆవిడే మనల్ని వెదుక్కుంటూ వచ్చింది. చేస్తే పులిరాజుగారి దగ్గరే పని చేయాలంటూ-మీరు మళ్లీ అడక్కండి. జీతానికి చచ్చేట్టు రాజీపడిపోయింది. ఆ నల్ల టై ఆమె ముందు కట్టుకోకండి. ఆ రంగంటే ఆవిడ పడిచచ్చిపోతుందట!"

నాకు మత్తెక్కుతోంది. నేను తెల్లబోయి చూడడం గమనించి తాయిలమ్మ నవ్వుతోంది. "మీ మనస్సులో ఏం ఆలోచిస్తున్నారో నాకు తెలుసులెండి. మీ లీలలన్నీ ఆవిడకీ తెలుసట. పైగా ఆవిడకీ బోలెడు లీలలున్నాయి!" దగ్గరకి తల వంచి "ఒక మొగుడు వదిలేస్తే-మరొకడితో కాపురం చేస్తోంది. ఇంక మీరు ఆడింది ఆట, పాడింది పాట-"

అయ్యా, భగవంతుడు ప్రత్యక్షమై కల్లుకుండ చేతిలో పెడితే ఆ కల్లు రుచించదు. తాయిలమ్మ రెచ్చగొట్టే వ్యభిచారం నా నంజుడంత రుచిగా లేదు. కాకపోతే పరిమళని ఎవరు వదులుకుంటారు? పైగా నాలాగే రుచిమరిగిన పులి! ఆ రోజు క్లబ్బుకి వెళ్లి-రెండు పెగ్గులు ఎక్కువ లాగించాను.

### పరిమళ

ఈ ఉద్యోగంలో చేరినప్పటినుంచీ నాకేదో యిబ్బందిగా ఉంది. కుటుంబంతో, పిల్లలతో డబ్బుకి ఇబ్బందిగా ఉండి, ఆయన చేరమన్నారు కనుక చేరాను కానీ ఉద్యోగాలకి నేను వ్యతిరేకం. ప్రోత్సాహమంతా శ్రీవారిదే. అదృష్టవశాత్తూ అన్యోన్యంగా ఉండే భార్యాభర్తల దగ్గర ఉద్యోగం దొరికింది. చేరినప్పటినుంచీ భర్త మంచితనం గురించీ, ప్రవర్తన గురించే తప్ప ఆవిడ మరో మాట మాట్లాడింది లేదు. నిజానికి ఆవిడ అందకత్తె కాదు. ఆయన అందగాడు. వయస్సులో ఉన్నవాడు. మరి ఆవిడనే ప్రేమిస్తూ, భార్యా విధేయుడుగా ఉన్నాడంటే ఆయనకి చెయ్యెత్తి దండం పెట్టాలి.

ఆయన ఆడుతూ పాడుతూ పూలరంగడిలాగా ఉద్యోగం చేసుకుపోతాడని తోటి నర్సులన్నారు. అలా అన్నప్పుడు వారి ముఖాల్లో నవ్వులు-వాళ్లెంత తృప్తిగా ఉద్యోగం చేస్తున్నారో చెప్తున్నాయి.

"డాక్టర్‌గారు పెద్ద హీరో!" అంది షకీలా నవ్వుతూ.

"డాక్టర్‌గారు ఒక్కసారి పరిచయమయితే ..." భుజాలెగరేసింది డ్యూటీ నర్స్ రాయుడమ్మ.

మొత్తానికి అందరి అభిమానం సంపాదించిన పెద్దమనిషి పులిరాజు. ఒకవిధంగా ఆయన రాకకి నేను కూడా ఆత్రుతగా ఎదురుచూశాను.

***

వేటాడే జంతువు ఒడుపు దొరికేదాకా వేట మీద దూకదు. దూకాక ఆయువుపట్టు పట్టేస్తుంది. పులిరాజు జీవితంలో ఈ ఒడుపు అతనికి రొటీను. పది అంగలముందే తన వేటని పసిగట్తాడు. అందం, అధికారం, చాకచక్యం అన్నీ ఉన్నాయి అతని దగ్గర. సాధారణంగా పేషెంట్లు కళ్లు తనిఖీ చేసేటప్పుడు లైట్లు ఆరుతాయి. చీకట్లో తన వేటే పక్కనుంటుంది. మొదట ఆమెకి భుజం తగులుతుంది. సాధారణంగా ఆవిడ చీకట్లో 'సారీ" చెప్తుంది. పేషెంట్ జెడ్, హెచ్, ఎస్ -చదువుతూంటాడు. ఈసారి డాక్టరుగారి చెయ్యి ఆమె చెంపకి రాసుకుంటుంది. ఆయన 'సారీ' చెప్పడు. ఆమె కంగుతిన్నా చీకట్లో తెలీదు. తెలిసేటట్టు ఊపిరి బిగుసుకుంటే మరో ఇద్దరు పేషెంట్లదాకా-లేదా, మరో రెండు రోజులదాకా కథ రెండో అంకానికి చేరదు. ఆ స్పర్శకి ఊపిరి విసులుకొంటే-పేషెంట్‌కి రెండో పరీక్ష ప్రారంభిస్తాడు డాక్టరు. ఈసారి చెంపకి చెయ్యి అనుకొంటుంది. పేషెంట్‌కి దృష్టి నికార్సుగా అక్షరాలమీద నిలిచేసరికి-నర్స్‌కీ, పులిరాజుకీ సయోధ్య కుదిరిపోతుంది. ఇది వేటలో ఓ ఘట్టం.-

పరిమళని చూసినప్పట్నుంచీ కడుపు నిండిపోయింది పులిరాజుకి. ఓ గొప్ప అనుబంధానికి ఇది ప్రారంభమనుకున్నాడు. అయినా పరిమళని ఇక్కడ ఉంచింది తాయిలమ్మ. తీరా పరిమళ కాలుజారిన మనిషి. పడుతూ లేస్తూ




-ఇద్దరు మొగుళ్లని మార్చి -ఏమయినా తొందరపడకూడదనుకొన్నాడు.

ఇలాంటి పెద్దమనిషితో జాగ్రత్తగా, మర్యాదగా, పరువుగా, భద్రంగా ఉండాలనుకుంది పరిమళ.


మొదటి కళ్లరోగి పరీక్షకి లైట్లు ఆర్పినప్పుడు-అలవాటుగా పులిరాజు భుజం ఆమెకి తగలలేదు. తగులుతుందని తెలీని పరిమళ ఆశ్చర్యపడలేదు. కాగా, ఆయన పెద్దరికం మీద మరింత నమ్మకం కలిగింది. ఆమె భుజం మొదట తనకు తగులుతుందని ఆశించాడు పులిరాజు. ఏమయినా, పరిమళ మనిషి రక్తం మరిగిన పులి. తగలకపోగా, "లంజ పాతివ్రత్యం నటిస్తోందోయ్!" అని రామప్పంతుల్లాగా అనుకొన్నాడు. అనుకొని నవ్వుకొన్నాడు.

తాయిలమ్మకి చూచాయగా ఈ వేట అనుపానులన్నీ తెలుసు. ఇద్దరి మధ్యా ఏమీ జరగకపోవడాన్ని ఆమె కనిపెడుతూనే ఉంది.

ఈ జరగకపోవడం-మరో ఆరు నెలలు జరిగింది. ఈ ఆరు నెలలలో రెండు అభిప్రాయాలు ఇద్దరిలోనూ స్థిరపడ్డాయి-పులిరాజు ఎన్నిక చేయదగ్గ పెద్దమనిషి అని రూఢి చేసుకుంది పరిమళ. ఆమె వందమందిలో ఆరితేరిన 'జాణ' అని పులిరాజు రుజువు చేసుకున్నాడు. అయితే ఆరు నెలలు ఏనాడూ పులిరాజు మడికట్టుకుని లేడు. ఈ ఆరు నెలల్లో కనీసం రెండు రోజులైనా-తాయిలమ్మ ఎక్కడ పడుకుందా అని చూశాడు. ఆమె రోజూ పడుకునే చోటే-అతని పడకగదికి దూరంగా మరొక్క గదిలో పడుకుని ఉంది. ఇప్పుడిప్పుడు ప్రత్యేకంగా ఉల్లిపొరలాంటి, మల్లెపువ్వులాంటి తెల్లటి చీరలు రాత్రి ప్రత్యేకంగా కట్టుకోవడం ప్రారంభించింది. కడ్డీల్లాగా పంపుతీరిన భుజాల మీదకి మల్లెపువ్వుల దండల్ని జార్చుకుంది. గులాబీ సెంటు గుమ్మరించుకోవడం మరచిపోలేదు. తన గదిలోకి పడుకోడానికి వెళ్లేటప్పుడు ఒక్క క్షణం తన గదిముందు భర్త ఆగడం గుర్తుపట్టింది. ఈసారి గది తలుపు ప్రత్యేకంగా మూసిపెట్టుకొంది.

చేతికందని ద్రాక్షపళ్లు చేదుగా ఉంటాయి. అది రూలు. చేదుగా ఉంటాయనిపించిన ద్రాక్షపళ్లు తీరా చేతికందకపోతే-ఓ విధమైన కసి పెరుగుతుంది. పరిమళ తనకి దూరంగా ఉండటం పులిరాజు అహంకారానికి దెబ్బతగిలింది. "దీన్ని నేను ప్రయత్నించి వలలో వేసుకోవాలా?" అనుకొంటూ బిగుసుకుపోయాడు.

రోజా ప్రేమ నటించే సినిమా హీరోయిన్ మీద హీరోగారికి నిజజీవితంలో వ్యామోహం పెరగదు. నటనలో 'అబద్ధం' జీవితంమీద తిరగబడుతుంది. రోజా నిజాయితీని నటించే వ్యభిచారిమీద సాటి వ్యభిచారికి వ్యామోహం పెరగదు, విముఖత పెరుగుతుంది. అది అవసరం వల్ల కాదు, అహంకారం వల్ల. పరిమళ మహాపతివ్రత అని పులిరాజు భావించి ఉంటే ఆమెను లొంగదీసుకోవాలనే కసి పెరిగేది. కానీ, "ఇలాంటి లంజల్ని వందమందిని కన్యాదానం చేసేవాణ్ని!" అనే రామప్పంతులు నిర్వేదంలో పడిపోయాడు.




మరి పరమళ మాటేమిటి? పులిరాజు అనే మహానుభావుడి మీద ఆమె అభిప్రాయం నానాటికీ పెరిగిపోయింది. ఇప్పుడామె భుజంమీద పులిరాజు చెయ్యి వేసినా, అది పొరపాటుగా అర్థం చేసుకుని ఆమె క్షమించగలదు.

ఇప్పుడిప్పుడు తాయిలమ్మ తన పడకగదికి-లోపల గడియపెట్టడం ప్రారంభించింది. పది నెలల తర్వాత ఓ రాత్రి ఆమె తలుపు చప్పుడయింది. విసుగ్గా తలుపు తీసింది తాయిలమ్మ-ఆ వచ్చింది భర్త అని గ్రహిస్తూనే. అప్పుడామె బ్రా గుండీలు ఊడిపోయి ఉన్నాయి. పువ్వులు ఆమె తల కింద నలిగే ఉన్నాయి. ఆ రాత్రి పదినెలలు ఉగ్గపట్టిన పులిరాజు కోరికంత అందంగా కనిపించింది తాయిలమ్మ. పెళ్లయిన పదకొండో యేట మొదటిసారిగా తన భార్యని 'రేప్' చేశాడు. భర్తలో రసికత్వానికి అంతే బలంగా, అంతే ఆవేశంగా సమాధానం చెప్పింది తాయిలమ్మ.

తర్వాత రెండు మూడు పనులు వరుసగా జరిగిపోయాయి. పరిమళ భర్త ఆరోగ్యం బాగోలేదని చెప్పి (పరిమళ చెప్పలేదు-తాయిలమ్మే చెప్పించింది) పరిమళ ఉద్యోగం తీసేసింది. ఎనిమిది వేల రూపాయల గాజుల జత పరిమళకి తొడిగి ఇంటికి పంపించింది.

హైదరాబాదులో కళ్ల ఆసుపత్రి అమ్మేసి మిరియాలగూడ మకాం మార్చేసింది. పులిరాజు తర్వాతెప్పుడూ నంజుడు గురించి ఆలోచించలేదు. మరో పదినెలలకి తాయిలమ్మకి గురవయ్యానాయుడు పుట్టాడు.

***

ఈ డెబ్బై అయిదవ ఏట దాదాపు నలభై ఏళ్లుగా పులిరాజు అడుగుతున్న ప్రశ్నకి నవ్వుతూ, గర్వంగా సమాధానం చెప్పింది తాయిలమ్మ.

"భగవంతుడి ముందు భక్తుడు నిర్వీర్యుడవుతాడు. నిన్ను గొప్పవాడిని చేసి పరిమళ ముందు నిలబెట్టాను. ఆవిడేనాడూ నిన్ను వ్యభిచారిగా చూడలేదు. కోరికలో మునిగి తేలే మనిషి-అలాంటి మరో వ్యక్తిముందు నిర్వీర్యుడవుతాడు. నీముందు పరిమళని మరో 'వ్యభిచారిణి'ని చేశాను. నువ్వు ఆవిడ అందంతో పోటీపడ్డావు. అది నీ బలహీనత నీకిచ్చిన అహంకారం. అందరిలాగా ఆమెను లొంగదీసుకోడానికి ప్రయత్నించలేదు. ఆమె లొంగిపోవడానికి ఎదురుచూశావు! ఈ ప్రయత్నంలో నా చేతిలో లేని సమస్య ఒక్కటే మిగిలిపోయింది!" ఆగింది తాయిలమ్మ.

ఏమిటన్నాడు పులిరాజు.

"నువ్వు తొందరపడి ఆమె భుజంమీద చెయ్యి వేస్తే ఏమయ్యేది? ఆమె బాధతో కన్నీరు కార్చేదా? ఆవేశంతో చెంప పగలగొట్టేదా? ఆనందంగా లొంగిపోయేదా? ఎవరికీ తెలియదు, ఎప్పటికీ తెలియదు! అయితే ఆ మూడు పనులకీ నేను సిద్ధపడి రిస్క్ తీసుకున్నాను" అంది తాయిలమ్మ నవ్వుతూ.

పులిరాజు తనని ఎవరో మోసం చేసినట్టు గిజగిజలాడాడు. కాస్సేపు. మోసం చేసింది తన భార్య! లక్ష్యం తనని దక్కించుకోవడం. దీనికి ఏ కోర్టులోనూ అప్పీలు లేదు!! ■